## వెటర్నరీ ఎన్ఆర్ఐ సీట్ల పెంపు

వ్యవసాయ యూనివర్సిటీ, మే 29: పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్(బీవీఎస్సీ) డిగ్రీ కోర్సులకు సంబంధించి సెల్ఫ్ ఫైనాన్స్ (ఎన్ఆర్ఐ) కోటా సీట్లను 15కు పెంచాలని పాలకమండలి నిర్ణయించినట్లు వర్సిటీ వీసీ జ్ఞాన ప్రకాష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజేంద్రనగర్, కోరుట్లలో ఒక్కోదానిలో 5 సీట్ల చొప్పున 10 ఉన్నాయని, కొత్తగా వరంగల్ జిల్లా మాములూరు కళాశాలకు జాతీయ వైద్య మండలి వీసీఐ గుర్తింపు లభించినందున దానిలోను 5 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేసేందుకు పాలకమండలి అనుమతి ఇచ్చిందని వీసీ తెలిపారు.

## రాజ్‌భవన్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్

సిటీ బ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరింత మంది పిల్లలకు ప్రవేశాలు కల్పించేందుకు అదనపు తరగతిగదుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. గురువారం రాజ్‌భవన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆలియా ప్రభుత్వ మోడల్ ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మంచి ఉపాధ్యాయులు, మెరుగైన సౌకర్యాలు ఉన్నందున ఈ పాఠశాలలకు మంచి డిమాండ్ ఉందని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీమియా, డిప్యూటీ ఈఓబీ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఐఓఎస్ జీవీ గుప్తా, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ ఆర్.సుజాత, కమిటీ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## అలుగు వర్షిణిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**మాలమహానాడు**

హిమాయత్ నగర్, మే 29: రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో చదివే దళిత బాల, బాలికలతో పనిచేయించాలని రాష్ట్ర ఎస్సీ గురుకులాల సెక్రెటరీ అలుగు వర్షిణి చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బుతి శ్రీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వెంటనే అలుగు వర్షిణిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, బాల బాలికల సంరక్షణ చట్టాల కింద కేసులు నమోదు చేసి సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురుకుల విద్యార్థుల పట్ల అవమానకరంగా, కుల వివక్షను ప్రోత్సహించేలా అలుగు వర్షిణి మాటలు ఉన్నాయని మండిపడ్డారు. విద్యార్థులతో టాయిలెట్లు కడిగించడం, వంటగదిలో పనిచేయడం, గదులను శుభ్రం చేసుకోవాలని చెప్పడమంటే వెట్టిచాకిరితో సమానమని విమర్శించారు. మాజీ ఆర్ఎస్ఎస్ కార్యకర్త అయిన అలుగు వర్షిణి గురుకులాలను మూసివేసి దళిత విద్యార్థులకు విద్య అందకుండా చేయాలనే ఉద్దేశంతో కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని పబ్బుతి కృష్ణ ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యఅందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్టీపీల పనుల్లో వేగం పెంచండి

**జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి**

సిటీబ్యూరో, మే 29 (నమస్తే తెలంగాణ): ఎస్టీపీల పనుల్లో వేగంపెంచి తుదిదశలో ఉన్నవాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఈడీ మాయాంక్ మిట్టల్‌తో కలిసి అంబర్‌పేట్, అత్తాపూర్ ఎస్టీపీలను సందర్శించారు. గార్డెనింగ్, పెయింటింగ్, అంతర్గత రోడ్ల నిర్మాణం లాంటి పనులను వేగంగా చేపట్టి ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎం సుజాత, ఎస్టీపీ ప్రాజెక్టు అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలా ముందుకు వెళ్దాం..?

- డబుల్‌బెడ్రూంల నిర్వహణ మున్సిపాలిటీలకు అప్పగింత
- అసలే నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న మున్సిపాలిటీలు
- కొత్త బాధ్యతలపై తలలు పట్టుకుంటున్న అధికారులు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 12కు పైగా డబుల్‌బెడ్రూం కాలనీలు



నాగారం మున్సిపల్ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీ

మేడ్చల్, మే 29 (నమస్తే తెలంగాణ): ఓవైపు మున్సిపాలిటీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతుంటే మరోవైపు డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్వహణ కూడా మున్సిపాలిటీలకు అప్పగించడంతో ఎలా ముందుకు వెళ్లాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో లేని డబుల్‌బెడ్‌రూమ్‌ల నిర్వహణ.. స్థానిక మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఇటీవల ఉత్తర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్‌ల కాలనీలు దాదాపు 12 వరకు ఉన్నాయి. ఇప్పుడు వాటి నిర్వహణ బాధ్యత స్థానిక మున్సిపాలిటీలదే అవడంతో తలకు మించిన భారంగా తయారైంది. మున్సిపాలిటీల అభివృద్ధికి ఇప్పటికే ప్రభుత్వం ఎలాంటి నిధుల మంజూరు చేయకపోవడంతో మున్సిపాలిటీలలో సమస్యలు పేరుకపోతున్నాయి. మున్సిపాలిటీలకు ప్రస్తుతం ఆస్తిపన్నులే ప్రధాన ఆదాయంగా మారిన క్రమంలో నిధులు సరిపోక స్థానికులు మౌలిక సదుపాయలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీనికి తోడు ప్రభుత్వం ఇప్పుడు డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్వహణ అప్పగింతపై ఎలా ముందుకు వెళ్లాలో అని మున్సిపల్ కార్యాలయాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేదల కోసం 27,472 డబుల్ బెడ్‌రూమ్‌లను నిర్మించి అర్హులైన నిరుపేదలకు అందించిన విషయం తెలిసిందే. దుండిగల్, దమ్మాయిగూడ, పోచారం, నాగారం, తూకుంట, గుండ్లపోచంపల్లి, పీర్జాదిగూడ, నిజాంపేట్, జవహర్‌నగర్, మురహరిపల్లిలో డబుల్‌బెడ్‌రూమ్‌లను నిర్మించారు. అప్పట్లో జీహెచ్ఎంసీ పరిధిలో ఉండే వాటి నిర్వహణ ఇటీవల ప్రభుత్వం స్థానిక మున్సిపాలిటీలకు అప్పగించింది. ఆయా డబుల్ బెడ్‌రూమ్ కాలనీల్లో సుమారు 90 శాతం మంది లబ్ధిదారులు వచ్చి చేరడంతో మౌలిక సదుపాయలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అంతేకాక డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్వహణకు అసోసియేషన్ల ఏర్పాటుకు మున్సిపాలిటీ అధికారులే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇకనుంచి డబుల్ బెడ్‌రూమ్‌ల ఆస్తిపన్నులు, నీటి పన్నులు మున్సిపాలిటీ వారే వసూళ్లు చేయాల్సి ఉంటుంది. డబుల్‌బెడ్‌రూమ్‌లో నివసించే ప్రజలు ఏ సమస్య వచ్చిన స్థానిక మున్సిపాలిటీలనే సంప్రందించాల్సి ఉంటుంది. డబుల్‌బెడ్ రూమ్‌లు ఖాళీగా ఉన్న నేపథ్యంలో డబుల్‌బెడ్ రూమ్‌ల లబ్ధిదారులకు ఇటీవలే అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎలా ముందుకు వెళ్లాలా అని మున్సిపల్ అధికారులు తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం.

# యూనియన్లపై దుష్ప్రచారం చేస్తున్నారు

**టీజీఆర్టీసీ జాక్**

సిటీబ్యూరో, మే29,(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు అర్ధరాత్రులు ఉద్యోగులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వెంటనే దాన్ని నిలిపేయాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కోచైర్మన్ కె.హన్మంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కోకన్వీనర్లు యాదయ్య, సురేష్, యాదగిరి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. ప్రతిరోజు చెమటోడ్చి పనిచేసే సిబ్బంది అలసిపోయి రాత్రివేళల్లో డిపోలలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో వారి నిద్రను భంగం చేస్తూ, డ్యూటీలో లేనప్పటికీ వారికి బలవంతంగా నాసిరకం మిషన్లతో బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు జరుపుతూ, కేసులు నమోదు చేస్తూ వారిని తీవ్ర భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఏడీసీ, కంట్రోలర్, గ్యారేజి సిబ్బందిని కూడా రాత్రి వేళల్లో ఇదే విధమైన ఇబ్బందులకు గురిచేస్తూ మానసిక ప్రశాంతత లేకుండా చేస్తున్నారని విమర్శించారు. ఒకపక్క ఆర్టీసి యాజమాన్యం కార్మికుల మీద ప్రేమ ఉన్నట్లు పైకి చెప్తూనే, ఉద్దేశపూర్వకంగా వారిని పలు రకాలుగా వేధింపులకు గురిచేస్తున్నారని, అందుకు ఈ విధానాలే నిదర్శనమని స్పష్టం చేశారు. ఈనెల 27న జరిగిన వెల్ఫేర్ బోర్డు సమావేశంలో బోర్డు మెంబర్లను అడ్డు పెట్టుకుని యాజమాన్యం.. యూనియన్లపై తమ అక్కసును వెళ్లగక్కుతూ కార్మికులను యూనియన్లకు దూరం చేసే విధంగా సంఘాలపై ఉక్కుపాదం మోపే ప్రయత్నం చేసిందని అన్నారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా తమ హక్కుల కోసం నిజాయితీగా పోరాడే సంఘాలను కార్మికులు విడనాడరని, అందుకు ఈ మధ్య కాలంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోరాటాలలో పెద్ద ఎత్తున కార్మికవర్గం పాల్గొనటమే నిదర్శనమని తెలిపారు.

### ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నారు..

ఆర్టీసి యాజమాన్యం రాచరికపు పాలనకు అలవాటు పడి కార్మిక సంఘాలపై దుష్ప్రచారం చేస్తూ యూనియన్లు అవసరం లేదని ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు సమర్పిస్తూ పక్కదారి పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతి డిపోలో ఇష్టారాజ్యంగా కిలోమీటర్ల పేరుతో పనిగంటలు పెంచుతూ కార్మికులచే గొడ్డు చాకిరీ చేయిస్తూ శ్రమకు తగిన ఫలితం ఇవ్వడం విస్మరించడం ఆర్టీసి యాజమాన్యానికే చెల్లిందని అన్నారు. యాజమాన్యం అనుసరిస్తున్న ఈ కార్మిక వ్యతిరేక విధానాల వలన కార్మికులలో అసహనం పెరిగి, తద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అలాగే ఆర్టీసి కార్మికవర్గాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మార్చేలా యాజమాన్యం వ్యవహరిస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ యాజమాన్య నిరంకుశ విధానాలను రూపుమాపడానికి తగు ఆదేశాలు జారీచేసి కార్మికులలో నెలకొన్న భయాందోళనలను తొలగించాలని, సమ్మె వాయిదా వేసిన సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆర్టీసి కార్మికవర్గమంతా సంబురాలు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

# ఫార్మసీ అధికారులను నియమించండి



ఫణీంద్రకుమార్‌ను సన్మానిస్తున్న ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

అబిడ్స్, మే 29: తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం టీజీఎస్ ఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఫణీంద్ర కుమార్(ఐఏఎస్)ను కోఠిలోని ప్రధాన కార్యాలయంలో కలిసి ఫార్మసీ ఆఫీసర్స్ పండుగ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా స్టేట్ ప్రెసిడెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యల మీద రిప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలోని అన్ని సెంట్రల్ మెడిసిన్స్ స్టోర్స్‌లలో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్స్ మరియు జిల్లా ఫార్మసీ ఆఫీసర్స్‌ను నియమించాలని కోరగా మేనేజింగ్ డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె. కౌటిల్య, జనరల్ మేనేజర్ రుక్మారెడ్డిను సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌అశోక్, రాష్ట్ర కోశాధికారి యాదయ్య, రాష్ట్ర కార్యదర్శి పకాశ్‌రావు, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, అలీ, రాష్ట్ర మహిళా నాయకురాలు మాధవి, రాధిక, అలేఖ్య పాల్గొన్నారు.

## పేరుకే పైలెట్ ప్రాజెక్ట్

**రెవెన్యూ దరఖాస్తులకు అందని మోక్షం**

మేడ్చల్, మే 29 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో భాగంగా పైలెట్ ప్రాజెక్టుకు ఎంపికైన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో స్వీకరించిన దరఖాస్తులకు మోక్షం లభించడం లేదు. జిల్లా పరిధిలోని కీసర మండలంలో ఈనెల 5 నుంచి 13 వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించగా భూసమస్యలపై 1,058 దరఖాస్తులు వచ్చాయి.

### పరిష్కరించినవి 406 దరఖాస్తులే..

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరిస్తామని కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన మాటలు నీటి మూటలుగానే మిగిలాయనే విమర్శలూ లేకపోలేదు. ఒక్క కీసర మండలానికి సంబంధించే 1,058 దరఖాస్తులు రాగా అందులో 406 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించినట్లు సమాచారం. అందులోనూ ఎన్ని దరఖాస్తులు రిజెక్ట్ అయ్యాయో కూడా అధికారులు వెల్లడించని పరిస్థితి. మిగిలిన దరఖాస్తులు సైతం ఎప్పటివరకు పరిష్కరిస్తారో తెలియని పరిస్థితి. దీంతో భూ భారతి చట్టం ద్వారా తక్షణమే సమస్యలు పరిష్కరిస్తామన్న అప్పట్లో ప్రభుత్వ పెద్దల ఊకదంపుడు ఉపన్యాసాలపై ఇప్పుడు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ఖజానా నింపుకునేందుకే అందాల పోటీలు

**పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య**




సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

ఖైరతాబాద్, మే 29: రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ప్రయోజనాల కోసమే అందాల (మిస్ వరల్డ్) పోటీలను నిర్వహిస్తోందని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య ఆరోపించారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. భారతీయ సంస్కృతి అంటే మహిళలను బజారుకీడ్చటం, అందచందాలను ప్రదర్శించడమేనా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ ఖాజానాను నింపుకోవడం కోసమే ఈ పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిత్యం మహిళలు అనేక అవమానాలకు, హత్యలకు, లైంగికదాడులకు గురవుతున్నారని.. ఇలాంటి సమయంలో నిర్వహించిన ఈ పోటీలు మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు.

### కేసులు పెడుతున్నారు..

అందాల పోటీలను నిలిపివేయమంటే పోలీసులతో కేసులు పెట్టిస్తున్నారని, అరెస్టు చేయిస్తున్నారన్నారు. అందాల పోటీలతో రాష్ట్ర ప్రతిష్ట మొత్తం దిగజారిందన్నారు. సుందరీమణుల కాళ్లను తెలంగాణ ఆడపడుచులతో కడిగించడమేమిటని ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ విల్లా మ్యాగి ఆరోపణలతో దేశం పరువు మంటగలిసిందన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో ప్రజలకు చెప్పాలన్నారు. హైదరాబాద్ ప్రతిష్ట పెరుగుతుందని, పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అబద్దాలు చెబుతుందన్నారు. గతంలో మహారాష్ట్ర, బెంగళూరులో ఈ పోటీలు నిర్వహించారని, అక్కడేమైనా పెట్టుబడులు వచ్చాయా అని ప్రశ్నించారు. మిస్ ఇంగ్లాండ్ మిల్లా మ్యాగికి అండగా నిలుస్తామన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకురాలు నేదునూరి జ్యోతి, సజయ, దేవి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న బత్తిని అమర్నాథ్‌గౌడ్

# జూన్ 8న చేపప్రసాదం పంపిణీ

**బత్తిని అమర్నాథ్‌గౌడ్**

రవీంద్రభారతి, మే 29: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జూన్ 8వ తేదీ ఉదయం 10 గంటలకు నుంచి జూన్ 9వ తేదీ రాత్రి 10 గంటల వరకు చేపప్రసాదాన్ని పంపిణి చేస్తున్నామని బత్తిని గౌడ్స్ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కీర్తిశేషులు బత్తిని హరినాథ్‌గౌడ్ తనయుడు అమర్నాథ్‌గౌడ్ మాట్లాడారు. తమ కుటుంబ సభ్యులు శివశంకర్‌గౌడ్, గౌరీశంకర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, శివగౌడ్‌తో కలిసి చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పర్యవేక్షణలో సంబంధిత ప్రభుత్వ శాఖలు హైదరాబాద్ కలెక్టర్, డీజీపీ, కమిషనర్ల సహకారంతో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. దాదాపు రెండు శతాబ్దాలుగా తమ కుటుంబం ఆస్తమా, ఉబ్బసం, దగ్గు, దమ్ము వంటి శ్వాసకోస సంబంధిత వ్యాధుల నివారణ కోసం మృగశిర కార్తె ప్రవేశించిన ఘడియల్లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి రోగి 4 నుంచి 5 సంవత్సరాలు చేప ప్రసాదం తీసుకుంటే రోగం పూర్తిగా నయం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో అజిత్‌గుప్త, కైలాస్ కేడియ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్**

సిటీబ్యూరో, మే29,(నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో శిథిలావస్థలో ఉన్న గృహాల కూల్చివేత సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న గృహాలు, సెల్లార్ నిర్మాణాలపై కమిషనర్ గురువారం తన ఛాంబర్ నుంచి జోనల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు గ్రేటర్ లో 428 శిథిలావస్థలో ఉన్న గృహాలను గుర్తించడం జరిగిందని, అందులో 131 గృహాలకు మరమ్మత్తులకు అవకాశం ఉందని మిగతా 297 నిర్మాణాలకు నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించే కుటుంబాలకు అవగాహన కల్పించి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల, మే 29: జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం అన్ని శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొంగరకలాన్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని అన్నారు. పోలీసు గౌరవ వందనంతోపాటు వేడుకలలో పోలీసు బందో బస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఈఓను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ ఏ.ఓ సునీల్, జిల్లా అధికారులు, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

# సీఎం రేవంత్ అసమర్ధత పాలనతోనే..

**ఆంధ్రప్రదేశ్ జలదోపిడీకి బాటలు**

కాచిగూడ, మే 29: సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థత పాలనను ఆసరాగా చేసుకుని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలంగాణ జల దోపిడీకి యత్నిస్తున్నాడని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. గురువారం కాచిగూడలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఎర్రసత్యం మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఆంధ్ర పాలకులు తెలంగాణలోని జలదోపిడీని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలకతీతంగా తెలంగాణలోని ప్రజలందరూ ఏకమై చంద్రబాబు(ఏపీ) జల దోపిడీని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కృష్ణ, గోదావరి జలాలపై తెలంగాణ రాష్ట్రానికి పూర్తి హక్కులు ఉన్నాయని, తెలంగాణలో 700 కిలోమీటర్ల మేర గోదావరి పరీవాహక ప్రాంతం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు చేపట్టబోయే బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల జలాల పంపిణీ సమస్యను కేంద్ర తక్షణమే పరిష్కరించాలని ఎర్రసత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని తెలంగాణ బీజేపీ నాయకులు కేంద్రంతో మాట్లాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు.. శ్రీనివాస్ యాదవ్, సుధాకర్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్‌నేత, గోపి తదితరులు పాల్గొన్నారు.

# డల్లాస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

**వివేకానందనగర్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**




డల్లాస్‌లో సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు

మియాపూర్, మే 29: అమెరికాలోని డల్లాస్‌లో జూన్ 1వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఎన్నారైలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వివేకానందనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు కోరారు. ఉద్యమ నాయకుడు తొలి సీఎం కేసీఆర్ వీరోచిత పోరాటంతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని మున్ముందు మరింతగా అభివృద్ధి పథంలో నడిపించుకునేలా సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. అమెరికా దేశంలోని డల్లాస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో గురువారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతియుత పథంలో కేసీఆర్ ఉద్యమాన్ని కొనసాగించి స్వరాష్ట్ర కలను సాకారం చేశారని అన్నారు. జూన్ 1న జరిగే రజతోత్సవ సభకు అమెరికాలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ఎన్ఆర్ఐలు, పార్టీ అభిమానులు తరలివచ్చి దిగ్విజయం చేయాలని రంగారావు కోరారు.

# గద్దర్ అవార్డుల ఎంపికకు ప్రామాణికత ఏమిటి?

- చరిత్రను వక్రీకరించిన సినిమాలకు అవార్డులెలా ఇస్తారు
- రేవంత్ సర్కార్‌పై ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఫైర్



గద్దర్ అవార్డులను నిరసిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న భూపతి వెంకటేశ్వర్లు తదితరులు

ముషీరాబాద్, మే 29: చరిత్రను వక్రీకరించిన సినిమా(రజాకార్)తో పాటు స్మగ్లర్ పాత్ర(పుష్ప-2)కు గద్దర్ అవార్డు ప్రకటించడం దేనికి సంకేతమని ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు .. రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉత్తమ చారిత్రిక చిత్రంగా రజాకార్ సినిమాను ఎంపిక చేసిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ లౌకిక ప్రజాస్వామ్యానికి అప్రతిష్ట పాలు చేసిందని ఆయన ఆరోపించారు. ఎన్నో ఏళ్లనుంచి ఎదురుచూస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డులు ప్రకటించిన తీరు యావత్ కళా హృదయాలను కలచివేసింది అని అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 2024 ఏడాదికి సంబంధించి ఉత్తమ మొదటి చిత్రంగా చరిత్ర విభాగంలో ఫ్యూచర్ హెరిటేజ్ చిత్రంగా రజాకార్ సినిమాకు, రెండవ చిత్రం పోటేలు సినిమా, మూడవ చిత్రం లక్కీ భాస్కర్, ఉత్తమ నటుడిగా అల్లుఅర్జున్, ఉత్తమ దర్శకుడు కల్కి సినిమాకు ఇవ్వడం దారుణమన్నారు. కల్కి, రజాకార్ సినిమాలు చరిత్రను వక్రీకరించడంతో పాటు మతోన్మాదాన్ని ప్రేరేపించిన సినిమాలని ఆరోపించారు. ఇటువంటి సినిమాలకు గద్దర్ అవార్డ్స్ ఇవ్వడమంటే గద్దర్‌ను అవమానించడమేనని వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. తక్షణమే గద్దర్ అవార్డు సెలక్షన్ కమిటీని రద్దు చేయడంతో పాటు సెలక్షన్ కమిటీ అవార్డులను ఎంపిక చేసేందుకు ఏ ప్రామాణికతను పాటించిందో స్పష్టం చేయాలన్నారు. సర్వమతాలను సమానంగా గౌరవించే భిన్నత్వంలో ఏకత్వం కలిగిన సంస్కృతిని ప్రోత్సహించే సినిమాలకు గద్దర్ అవార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి మత తత్వ సినిమాలను ప్రోత్సహించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి ఆలోచించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సినిమా జానపద జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మురళీధర్ దేశ్‌పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం నగర ఉపాధ్యక్షుడు పొన్నం రాజయ్య గౌడ్, ఆదివాసీ కళాకారులు పాయం విజయ, మండేపూడి శమంతకమణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.